# 3

# పరిశుద్ధాత్మ & బయల్పాటు

*"నేను మీతో చెప్పవలసినవి ఇంకను అనేక సంగతులు కలవు గాని యిప్పుడు మీరు వాటిని సహింపలేరు. అయితే ఆయన, అనగా సత్యస్వరూపియైన* ***ఆత్మ*** *వచ్చినప్పుడు మిమ్మును సర్వసత్యములోనికి నడిపించును; ఆయన తనంతట తానే యేమియు బోధింపక, వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును. ఆయన నా వాటిలోనివి తీసికొని మీకు తెలియజేయును గనుక నన్ను మహిమపరచును" (యోహాను 16:12-14).*

మానవ జాతి అంతటికొరకు ఏర్పరచబడిన మనుష్యులకు బోధించుట పరిశుద్ధాత్మ యొక్క ప్రధాన కర్తవ్యమైయుంటుంది. వారు ఆయన వాక్యాన్ని పలుకుతారు, వ్రాస్తారు. దేవుడు పరిశుద్ధాత్మ ద్వారా బయలుపరచబడిన సందేశాన్ని బైబిలు కలిగియుంది.

## ఆత్మ సందేశాన్ని ఎలా బయలుపరచాడు?

పౌలు *theopnustos* ("దేవుడు ఊదెను") అనే పదాన్ని ఉపయోగించాడు. దానిని "దేవుడు ప్రేరేపించెను" అని తర్జుమా చేయబడింది. లేఖనాలు యివ్వబడిన తీరు యిలా వర్ణించబడింది: "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడియుండునట్లు దైవావేశమువలన కలిగిన ప్రతి లేఖనము, ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2 తిమోతి 3:16, 17). దేవుడు ఉపయోగించిన మూలము ఈ లేఖన భాగము వివరించనందున, దేవుడు తన వాక్యాన్ని ఎలా బయలుపరచాడో తెలిసికొనడానికి, మనం యితర లేఖన భాగాలను పఠించవలసియుంటుంది.

పరిశుద్ధాత్మ నడిపింపు ద్వారా ఏర్పరచుకొన్న మనుష్యులకు దేవుడు తన వాక్యమును బయలుపరచినట్లు బైబిలు బోధించుచున్నది. లేఖనాలను రాసినవారు తాము రాసినవాటికి కర్తలు కారు. వారు రాసింది పరిశుద్ధాత్మ వారికి బయలుపరచిందే.

అలాగే, యేసు తన అపొస్తలులకు (మత్తయి 10:2-4) యిలా తెలిపారు, "... ఏలాగు మాటాడుదుము? ఏమి చెప్పుదుము? అని చింతింపకుడి; మీరేమి చెప్పవలెనో అది ఆ గడియలోనే మీకనుగ్రహింపబడును. మీ తండ్రి **ఆత్మ** మీలో ఉండి మాటలాడుచున్నాడే గాని మాటలాడువారు మీరు కారు" (మత్తయి 10:19, 20). ప్రభువు వాగ్దానం చేసినదేమో గమనించు: (1) "ఎలాగు" మాటాడవలెనో వారు చింతించనవసరం లేదు. (2) "ఏమి" చెప్పుదుమోయని వారు ఆందోళన పడనవసరం లేదు. వారికున్న

నమ్మికకు హేతువేమనగా (3) వారు మాట్లాడవలసినదేమో అది వారికి యివ్వబడుతుంది. (4) మాట్లాడేది వారు కారు, కాని (5) ఆత్మయే "వారిలో" ఉండి మాట్లాడతాడు.

అందువలన, అపొస్తలులు ఉపదేశించిన సందేశం వారినుండి ఉత్పన్నమైనది కాదు. వారికి మాటలు పరిశుద్ధాత్మవలన యివ్వబడ్డాయి (1 కొరింథీ. 2:13). ఈ భావనకు కొందరు ఆక్షేపణ తెలిపారు; లేఖకులు తమ సొంతమైన శైలిలో వ్రాసియున్నందున, లేఖికులకు కేవలం భావాలు మాత్రమే అందింపబడితే, తమ సొంత మాటలలో దైవప్రేరేపితమైన బోధను వ్యక్తపరచారని వారు అభిప్రాయపడ్డారు. ఇది అనవసరమైన తీర్మానం, ఏమి జరుగుతుందని ప్రభువు చెప్పారో దానికి వ్యతిరేకమైనది.

## వారి శైలిని ఉపయోగించుకున్నారు

ప్రతి లేఖికుని స్థానిక భాషను పద ప్రయోగాలను పరిశుద్ధాత్మ ఉపయోగించు కొనగలడు. దేవుని వాక్యాన్ని బయలుపరచడంలో తనదైన శైలిని ఎందుకు ఆయన ఉపయోగించుకొనలేదు? ఒక నిపుణుడైన సంగీత విధ్వాంసుడు ఒకే రాగాన్ని పలురకాలైన వాయిద్యాలమీద వాయించగలడు. తర్ఫీదు పొందిన శ్రోతయైతే ఏ వాయిద్యం మీద ఆ రాగం ఆలాపించబడిందో గుర్తించగలడు. ప్రతి వాయిద్యానికి వ్యత్యాసమైన ధ్వని ఉంటుంది గాని, బాగుగా వాయించబడిన రాగం ఎల్లప్పుడు ఒకటిగానే ఉంటుంది. అదేవిధంగా, దైవప్రేరేపితులైన ప్రతి వ్యక్తిగత లేఖికుని శైలిని పరిశుద్ధాత్మ వినియోగించుకున్నాడు. తాను ఏమి చెప్పదలచుకున్నాడో, సరిగ్గా దానినే ఆయన చెప్పాడు – ఆ వ్యక్తి యొక్క వ్యక్తపరచే విధానాన్ని మాత్రం ఆయన ఉపయోగించుకున్నాడు.

R. C. H. Lenski (లెన్స్కీ) సరిగ్గా తెలిపాడు,

> తన వ్యక్తిగత శైలితోను మాటల మూటతోను ఆత్మ ప్రతి లేఖికుని ఉపయోగించు కున్నాడన్న వాస్తవం, ఆత్మ బోధనుండి యాంత్రికమైన ప్రతిదీ తొలిగింపబడిందన్న సంగతిని చూపుతుంది. లేఖికులనందరిని అదే మాటల మూటను, అదే శైలిని ఉపయోగించుడని ఆయన బలవంత పెట్టియుండినట్టయితే, ఆయన యాంత్రికంగా కార్యం జరిగించినట్టు మనం అనుమానపడుతూ ఉండేవారమే. అప్పుడు మాత్రమే, అప్పుడు కూడ మనం అపార్థం చేసికొనియుండేవారమే. వివిధ లేఖికులను దైవికమైన ఉపదేశకులను ఉపదేశకుడు శక్తివంతంగా ఉపయోగించుకున్నందున వచ్చిన అన్ని విధాలైన రూపాల నడుమ ఒక ఆశ్చర్యకరమైన వాస్తవం నిలిచింది: ఏ ఒక్క రచయితయు తప్పు స్వరాన్ని పలుకలేదు, తప్పుడు మాటను గాని లేక ప్రయోగాన్ని గాని ఉపయోగించ లేదు సరిగదా, ఒక శైలిలో ఒక లేఖికుడు వ్యక్తపరచిన ప్రతిపాదనను మరో శైలిలో వ్యక్తపరచిన పరిశుద్ధ లేఖికుడు వ్యతిరేకించను లేదు.[1]

## వారి పదాలను వినియోగించుకున్నాడు

దైవప్రేరేపితులగు మనుష్యులకు సందేశాన్ని బయలుపరచడంలో పరిశుద్ధాత్మ "పదాలను" సయితం నేర్పించినట్టు పౌలు బోధించాడు. అతడిలా రాశాడు: "దేవునివలన మనకు దయచేయబడినవాటిని తెలిసికొనుటకై మనము లౌకికాత్మను కాక దేవుని యొద్దనుండి వచ్చు ఆత్మను పొందియున్నాము. మనుష్యజ్ఞానము నేర్పు మాటలతో గాక

**ఆత్మ**సంబంధమైన సంగతులను ఆత్మ సంబంధమైన సంగతులతో సరిచూచుచు **ఆత్మ** నేర్పు మాటలతో వీటిని గూర్చియే మేము బోధించుచున్నాము" (1 కొరింథీ. 2:12, 13). ఆత్మ సంగతులను ఆత్మ నేర్పు "మాటల"తోనే పౌలు వ్యక్తపరచాడు.

Lenski యిలా అన్నాడు: "అపొస్తలులు పలికిన మాటలు ఆత్మచే వారు నేర్పింపబడిన మాటలే. కడకు మాటలవరకు సయితం ఆయన వారి ఉపదేశకుడైయున్నాడు. అక్షరార్థమైన దైవప్రేరేపణకు యిది అనుకూలమైన రుజువైయుండి, లేఖనములన్నిటిలో బోధింపబడి నిజముగా వాస్తవముగా లేఖనములన్నిటిలో తేటతెల్లమైయుంది."[2] కేవలం తలంపులను మాత్రమే బయలుపరచడానికి బదులు, తాను ప్రేరేపించిన మనుష్యులు ఉపయోగించే పదాలను సయితము ఆత్మయే ప్రసాదించాడు.

లేఖనములను వ్రాయడంలో **ఆత్మ** ఎలా ప్రేరేపించాడో గ్రహించడానికి గల ప్రాముఖ్యమైన భాగము 1 కొరింథీ. 2:12, 13:

> దేవునివలన మనకు దయచేయబడినవాటిని తెలిసికొనుటకై మనము లౌకికాత్మను కాక దేవుని యొద్దనుండి వచ్చు ఆత్మను పొందియున్నాము. మనుష్యజ్ఞానము నేర్పు మాటలతో గాక **ఆత్మ** సంబంధమైన సంగతులను ఆత్మసంబంధమైన సంగతులతో సరిచూచుచు, **ఆత్మ** నేర్పు మాటలతో వీటిని గూర్చియే మేము బోధించుచున్నాము.

ఈ లేఖన భాగాన్ని అర్థం చేసికొనడానికి గాను "మేము" అని పౌలు మాట్లాడుతున్నది ఎవరిని గూర్చియో మొదట తీర్మానించాలి. తన్ను సూచించుకున్నప్పుడు పౌలు "నేను" అని కొన్నిసార్లు అన్నాడు – తన్ను మాత్రమే గాక యితర దైవప్రేరేపితులైన లేఖికులను ఉదాహరణలనుగా ఉపయోగించినప్పుడు అతడు "మేము" అని ఉపయోగించాడు 1 కొరింథీ. 1లో, ఉత్తమ పురుషలో "నేను" అనే పదాన్ని నిలకడగా వినియోగించాడు (4, 10–12, 14, 16 వచనాలు); ఏదియెలాగున్నా, తరువాత అదే అధ్యాయంలో "మేము" అనే పదానికి మార్చుకున్నాడు: "అయితే మేము సిలువవేయబడిన క్రీస్తును ప్రకటించుచున్నాము" (23 వ.). ఈ వచనంలో "మేము," అన్నది శ్రోతలని అర్థం కాదు; కాని, తననూ దైవప్రేరేపితులైన యితరులనూ సూచించడమైనది.

ఇదే పద్ధతిని పౌలు 2వ అధ్యాయంలో కూడ కొనసాగించాడు, మొదటిగా "నేను" అని మాట్లాడాడు (1–3 వచనాలు) తరువాత, 6, 7 వచనాలలో, దేవుని వాక్యమును ఉపదేశించే యితరులను అతడు సూచించాడు: "పరిపూర్ణులైనవారి మధ్య జ్ఞానమును బోధించుచున్నాము, ... దేవుని జ్ఞానము మర్మమైనట్టుగా బోధించు చున్నాము."

ఈ విధానాన్ని కొందరు అలక్ష్యం చేసి, "మేము" అనే 1 కొరింథీ. 2:12లో దైవప్రేరేపితులు కాని క్రైస్తవులను చేర్చుతారు. ఆత్మ దాని భావాన్ని బయలుపరచితేనే దేవుని వాక్యాన్ని మనం గ్రహించుతామని వారు బోధిస్తారు. ఈ భావం Gordon Feeచే వ్యక్తపరచబడింది: "సిలువవేయబడినవాని ద్వారానే రక్షణయన్నట్టు ... పౌలు సూచించాడు (1:23, 24; 2:2లలో వలె). ఆత్మను పొందినందున దేవుని ప్రజలు దానిని సరిగ్గా గ్రహించగలరు."[3]

వ్యకిగతంగా ప్రతి క్రైస్తవునికి పరిశుద్ధాత్మ బోధిస్తాడనిగాని బయలుపరచుతాడని

గాని పౌలు ఉపదేశించుటలేదు సరిగదా పరిశుద్ధాత్మచే సహాయము చేయబడకుండ జనులు గ్రహించలేరని కూడ పౌలు అనలేదు. అయితే, అత్మచే ప్రేరేపింపబడిన మనుష్యుల ద్వారా దేవుడు తన జ్ఞానాన్ని బయలుపరచాడని అతడు ఉపదేశించాడు. ఆ బయల్పాటు ద్వారా దేవుని ఆలోచనలు తెలియబడతాయి (1 కొరింథీ. 2:10-12).

## దేవుని వాక్యాన్ని మనం ఎలా నేర్చుకుంటాం?

### లోకసంబంధమైన దృష్టినుండి కాదు

ఆత్మ సంబంధికాని మనుష్యుడు దేవుని వాక్యాన్ని అర్థం చేసికోలేకపోవడానికి గాని, అంగీకరించకపోవడానికి గాని రెండు కారణాలను పౌలు సూచించాడు: (1) దేవుని ప్రత్యక్షత వానికి వెర్రితనంగా ఉంటుంది. అతని ఆలోచన లౌకికంగా ఉంటుంది గనుక ఆత్మ సంబంధికానివానికి దేవుని ఉపదేశము అన్యముగా తోస్తుంది. పౌలు యిలా వివరించాడు: "సిలువను గూర్చిన వార్త నశించుచున్నవానికి వెర్రితనము గాని ..." (1 కొరింథీ. 1:18ఎ); "అయితే మేము సిలువేయబడిన క్రీస్తును ప్రకటించుచున్నాము" (1 కొరింథీ. 1:23). దేవుని జ్ఞానము లోకసంబంధి ఆలోచనా విధానానికి వెలుపల ఉన్నందున, అతడు దాని నంగీకరించడు. (2) దేవుని బయల్పాటు "ఆత్మ సంబంధమైనదై యుంది." భక్తిహీనుడు జ్ఞానాన్ని లోకసంబంధమైన దృష్టిలో చూచువాడు గనుక, దైవ సత్యసందేశాన్ని అతడు గ్రహించలేడు:

> "ఏ శరీరియు దేవుని యెదుట అతిశయింపకుండునట్లు, జ్ఞానులను సిగ్గుపరచుటకు లోకములోనుండు వెఱ్ఱివారిని దేవుడు ఏర్పరచుకొనియున్నాడు. బలవంతులైనవారిని సిగ్గుపరచుటకు లోకములో బలహీనులైనవారిని దేవుడు ఏర్పరచుకొనియున్నాడు. ఎన్నికైనవారిని వ్యర్థము చేయుటకు లోకములో నీచులైనవారిని, తృణీకరింపబడినవారిని, ఎన్నికలేనివారిని దేవుడు ఏర్పరచుకొనియున్నాడు" (1 కొరింథీ. 1:27-29).
>
> "నీవు జ్ఞానులకును వివేకులకును ఈ సంగతులను మరుగుచేసి పసిబాలురకు బయలుపరచినావని నిన్ను స్తుతించుచున్నాను" (మత్తయి 11:25బి).
>
> "దేవుని సంబంధియైనవాడు దేవుని మాటలు వినును. మీరు దేవుని సంబంధులు కారు గనుకనే మీరు వినరని చెప్పెను" (యోహాను 8:47).

వారు దేవుని మనస్సు "ఎరుగునట్లు" (1 కొరింథీ. 2:12), అపొస్తలులకును ప్రవక్తలకును **ఆత్మ** అనుగ్రహించబడింది. మనము దేవుని జ్ఞానమును గ్రహించ వీలుపడునట్లు ఆయన వాక్యము మనకందరికి బయలుపరచుటకై ఆత్మ వారికి "మాటలను" అనుగ్రహించాడు. ఆత్మయొక్క సంగతులను మనము అర్థము చేసికొనగలుగు నట్లు వారి ద్వారా మనకు ఆత్మ కాదు, వాక్యము అనుగ్రహించబడింది. లేఖనములను పఠించుటవలన మనం దేవుని చిత్తాన్ని నేర్చుకోవాలి. అపొస్తలులైతే దానిని ఆత్మనుండి

నేరైన ప్రత్యక్షతవలన పొందారు. ఆత్మసంబంధమైన దృష్టితో చదువుటవలన మనం దేవుని వాక్యాన్ని నేర్చుకుంటాం, కాని ఆత్మనుండి నేరుగా బయలుపరచబడినందున వారు దాన్ని పొందారు.

**పఠనము కొనసాగించుట ద్వారా**

దేవుని మర్మాలను అపొస్తలులకును, ప్రవక్తలకును పరిశుద్ధాత్మ బయలుపరచాడు. దైవప్రేరేపితులైన మనుష్యుల రచనలలో అవి నేడు పదిలపరచబడియున్నాయి. మనకు సమాచారమందించడానికిని, గ్రహింపు కలిగించడానికిని, దేవుని సత్యాన్ని తెలిసికో గలగడానికి ఈ సంగతులను రాసారు. మనలను కలతపరచడానికి అవి రాయబడలేదు. దేవుని వాక్యాన్ని పఠించడంలో కొనసాగడం ద్వారా, సత్యాన్ని మనం ఎరుగగలం. ప్రభువు యిలా అన్నారు, "–మీరు నా వాక్యమందు నిలిచినవారైతే నిజముగా నాకు శిష్యులై యుండి సత్యమును గ్రహించెదరు; అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును" (యోహాను 8:31బి, 32).

పౌలు యిలా రాశాడు,

> మీరు చదువుకొని పూర్తిగా గ్రహించిన సంగతులు తప్ప, మరేవియు మీకు వ్రాయుట లేదు; కడవరకు వీటిని ఒప్పుకొందురని నిరీక్షించుచున్నాము (2 కొరింథీ. 1:13).
>
> ఎట్లనగా – క్రీస్తు మర్మము దేవదర్శనమువలన నాకు తెలియపరచబడినదను సంగతిని గూర్చి మునుపు సంక్షేపముగా వ్రాసితిని. మీరు దానిని చదివినయెడల దానినిబట్టి ఆ క్రీస్తు మర్మమును గూర్చి నాకు కలిగిన జ్ఞానము గ్రహించుకొనగలరు. ఈ మర్మమిప్పుడు **ఆత్మ**మూలముగా దేవుని పరిశుద్ధులగు అపొస్తలులకును ప్రవక్తలకును బయలుపరచబడియున్నట్టుగా పూర్వకాలములయందు మనుష్యులకు తెలియపరచబడలేదు (ఎఫెసీ. 3:3–5).

మనకు దైవ సత్యము బయలుపరచబడునట్లు అపొస్తలులును, ప్రవక్తలును దైవప్రేరేపణతో రాశారు. చదువుట ద్వారా మనం ఈ సత్యాన్ని గ్రహించుకోవచ్చు. పరిశుద్ధాత్మ లేకుండ మనమీ సత్యాన్ని గ్రహించలేమని ఎక్కడను రాయబడియుండలేదు. పరిశుద్ధాత్మ ప్రతి క్రైస్తవుని సత్యములోనికి నడిపిస్తాడు అనే భావన కట్టుకథకు సంబంధించిందే, ఏ లేఖన సూత్రము మీదను అది ఆధారపడియుండ లేదు.

*రాయబడిన దేవుని వాక్యపు ప్రాథమిక సూత్రాలను అపార్థం చేసికొనేవారు తాము స్వయంగా చదువకను ధ్యానించకను ఉన్నందున అపార్థం చేసికొంటారు. వారిని వెలిగించుటలో ఆత్మ ఏ మాత్రమును తప్పిపోలేదు.* పౌలు వ్రాసిన పత్రికలలో "కొన్ని సంగతులు గ్రహించుటకు కష్టమైనవి. వీటిని విద్యావిహీనులును, అస్థిరులైనవారును, తక్కిన లేఖనములను అపార్థము చేసినట్లు, తమ స్వకీయ నాశనమునకు అపార్థము చేయుదురని" పేతురు తెలిపాడు (2 పేతురు 3:16). దీన్ని తప్పించుకునే మార్గము – "మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు అనుగ్రహించు కృపయందును జ్ఞానమందును అభివృద్ధి పొందు" టయే (2 పేతురు 3:18ఎ). గ్రహింపులేకపోవుటయు, అపార్థం

చేయుటయు విద్యావిహీనతయొక్క స్థితియైయున్నట్టు పేతురు నిందించాడే గాని, వ్యక్తిగతంగా పరిశుద్ధాత్మ నడిపింపు పొందలేనందున అని అతడు అనలేదు.

పరిశుద్ధాత్మవలన సహాయం పొందినవారే లేఖనాలను గ్రహించునట్టు లేఖనాలు రాసినవారు దేవుని వాక్యం మర్మంగా ఉండునట్టు దానికి ముసుకు వేయలేదు. ఎవరైనా దేవుడు బయలుపరచిన వాటిని చదివి గ్రహించగలుగునట్లు ఆత్మ నడిపింపుతో వారు రాశారు.

## ఆత్మకు దేవుని వాక్యానికి మధ్యగల సంబంధమేమి?

తన అపొస్తలులకు ప్రభువు ఏమి ప్రసాదించారో దాన్ని గూర్చి ఆయన యిలా పలికారు:

> నన్ను ప్రేమింపనివాడు నా మాట గైకొనడు; మీరు వినుచున్న మాట నామాట కాదు, నన్ను పంపిన తండ్రిదే (యోహాను 14:24).
>
> నీవు నాకు అనుగ్రహించినవన్నియు నీవలననే కలిగినవని వారిప్పుడు ఎరిగియున్నారు (యోహాను 17:8).
>
> వారికి నీ వాక్యమిచ్చియున్నాను (యోహాను 17:14ఎ).
>
> ఏలయనగా నా అంతట నేనే మాటలాడలేదు; నేను ఏమనవలెనో యేమి మాటలాడవలెనో దానిని గూర్చి నన్ను పంపిన తండ్రియే నాకాజ్ఞ యిచ్చియున్నాడు. మరియు ఆయన ఆజ్ఞ నిత్యజీవమని నేనెరుగుదును గనుక నేను చెప్పు సంగతులను తండ్రి నాతో చెప్పినప్రకారము చెప్పుచున్నాను (యోహాను 12:49, 50).

క్రొత్త నిబంధన సందేశం ప్రభువుతో ఆరంభమయ్యింది. "అట్టి రక్షణ ప్రభువు బోధించుటచేత ఆరంభమై, ... వినినవారిచేత మనకు దృఢపరచబడెను" (హెబ్రీ. 2:4బి).

క్రీస్తు ప్రభువు తండ్రినుండి పొందిన మాటలను ఆయన తన అపొస్తలులకు యిచ్చియున్నారు. తండ్రి యొద్దకు వెళ్లునట్లు ఆయన భూలోకాన్ని విడిచిపెట్టిన తరువాత, ఆ మాటలు పరిశుద్ధాత్మచేత వారికి జ్ఞాపకం చేయబడ్డాయి (యోహాను 14:26). దేవుని వాక్యమును బయలుపరచుట, స్థిరపరచుట, భద్రపరచుట అనేది పరిశుద్ధాత్మ యొక్క పనియైయున్నది.

### బయలుపరచుటలో

మనకున్న లేఖనములు దేవుని వాక్యమైయుంది ఎందుకంటె, వాటిని లేఖికులకు పరిశుద్ధాత్మ బయలుపరచాడు. "ఒకడు తన ఊహనుబట్టి చెప్పుటవలన లేఖనములో ఏ ప్రవచనమును పుట్టదని మొదట గ్రహించుకొనవలెను. ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపించబడినవారై దేవుని మూలముగా పలికిరి" (2 పేతురు 1:20, 21). లేఖనాల్లో

చెప్పబడింది దేవుడు చెప్పదలచుకున్న దానికి ప్రవక్త యొక్క వ్యాఖ్యానం కాదు. ప్రవక్త యొక్క వ్యక్తిగతమైన అభిప్రాయాలు లేఖనాల్లో కన్పించవు. 2 పేతురు 1:21లో - “ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి” అని పేతురు రాశాడు. దేవుడు బయలుపరచనుద్దేశించినదానికి ప్రవక్త రాసినది తన సొంత వ్యాఖ్యానం కాదు, కాని అది కేవలము దేవుని సొంతమైన సందేశమైయుంది (మత్తయి 10:19, 20 కూడ చూడు).

## స్థిరపరచడంలో

పరిశుద్ధాత్మ వాక్యాన్ని బయలుపరచడం మాత్రమే గాక, ఆయన దానిని స్థిరపరచాడు కూడ. ప్రభువు బోధించడాన్ని గూర్చి పరిశుద్ధాత్మ యిలా అన్నాడు: “అట్టి రక్షణ ప్రభువు బోధించుటచేత ఆరంభమై, దేవుడు తన చిత్తానుసారముగా సూచక క్రియలచేతను, మహత్కార్యములచేతను, నానావిధములైన అద్భుతములచేతను, వివిధములైన పరిశుద్ధాత్మ వరములను అనుగ్రహించుటచేతను, వారితోకూడ సాక్ష్యమిచ్చుచుండగా వినినవారిచేత మనకు దృఢపరచబడెను” (హెబ్రీ. 2:3బి, 4). ఇతర లేఖన భాగాలు యిలా అంటున్నాయి:

> వారు బయలుదేరి వాక్యమంతట ప్రకటించిరి. ప్రభువు వారికి సహకారుడైయుండి, వెనువెంట జరుగుచువచ్చిన సూచక క్రియలవలన వాక్యమును స్థిరపరచుచుండెను (మార్కు 16:20).
>
> కాబట్టి వారు ప్రభువును ఆనుకొని ధైర్యముగా మాటలాడుచు అక్కడ బహుకాలము గడిపిరి. ప్రభువు వారిచేత సూచకక్రియలను అద్భుతములను చేయించి, తన కృపావాక్యమునకు సాక్ష్యమిప్పించుచుండెను (అపో. 14:3).

దేవుడు తన వాక్యమును సూచక క్రియల చేతను మహత్కార్యముల చేతను స్థిరపరచాడు.

## భద్రపరచుటలో

పరిశుద్ధాత్మద్వారా యివ్వబడిన వాక్యము రచనా రూపంలో దైవప్రేరేపితులైన మనుష్యులచే భద్రపరచబడింది. “నేను మీకు వ్రాయుచున్నవి ప్రభువు ఆజ్ఞలని” పౌలు తెలిపాడు (1 కొరింథీ. 14:37). పౌలు యొక్క ఉపదేశాలు (బోధలు) పరిశుద్ధాత్మ ద్వారా బయలుపరచబడినవి (1 కొరింథీ. 2:12, 13). ఇతరులు కూడ అదే మూలమున పలికారు, రాశారు (ఎఫెసీ. 3:3-5).

పరిశుద్ధాత్మ ద్వారా బైబిలు దైవ ప్రేరేపితమగు దేవుని వాక్యముగా మనకు లభించింది (2 తిమోతి. 3:16; 2 పేతురు 1:20, 21).

## ముగింపు

తన వాక్యమును మనకు బయలుపరచుటలో దేవుని మూలంగా పరిశుద్ధాత్మ క్రియ జరిగించాడు. ప్రస్తుత క్రైస్తవ యుగమునందు, సర్వాధికారమియ్యబడిన యేసు (మత్తయి 28:18) వ్యక్తిగతంగా వాక్యాన్ని మానవ జాతికి తీసికొనివచ్చారు, పరిశుద్ధాత్మచే నడిపింపబడిన మనుష్యుల రచనల ద్వారా దాన్ని భద్రపరచాడు. పరిశుద్ధాత్మ కార్యము మీద ఆధారపడి తప్పుకాజాలని బయల్పాటు ప్రతి లేఖనములయందు ఉందని మనం ధైర్యంగా నమ్మవచ్చు.

---

సూచనలు

[1]R. C. H. Lenski, *The Interpretation of St. Paul's First and Second Epistles to the Corinthians* (Minneapolis, Minn.: Augsburg Publishing House, 1963), 112-13. [2]Ibid., 111-12. [3]Gordon D. Fee, *The First Epistle to the Corinthians,* The New International Commentary on the New Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1987), 113.